క్లుప్తంగా

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు



ట్రాక్టర్లను అడ్డుకుంటున్న స్థానికులు

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం పెన్న గడ్డం దళితవాడ సమీపంలోని స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమంగా తవ్వి తరలిస్తున్న వారిని స్థానికులు శుక్రవారం అడ్డుకున్నారు. టీడీపీ నాయకులు ఇసుకను వ్యాపార వస్తువుగా మార్చుకుని యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇక్కడ నుంచి ఒక్క రేణువు ఇసుక తరలించేందుకు వీలు లేదని గ్రామస్తులు, మహిళలు ఇసుకాసురులను అడ్డుకున్నారు.

సీసీ కెమెరాలు, ఎల్ఈడీ టీవీల సమర్పణ



శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఏర్పాటు చేసిన ఎల్ఈడీ టీవీలు

నాగలాపురం: మండలంలో సురుటుపల్లెలోని పళ్లికొండేశ్వరస్వామి ఆలయానికి శ్రీసిటీ ఎండి రవీంద్రసన్నారెడ్డి రూ.2.45లక్షల విలువైలన రెండు ఎల్ఈడీ టీవీలు, సీసీ కెమెరాలు సమర్పించారు. ఆలయంలో ప్రతి గురువారం ప్రదోష మండపంలో దాంపత్య దక్షిణామూర్తికి జరిగే ప్రత్యేక పూజలు, ప్రదోష పూజలు భక్తులకు తెలిసేలా ఎల్ఈడీ టీవీలు ఏర్పాటు చేశామన్నారు.

15 నుంచి ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు

శ్రీకాళహస్తి: తిరుపతిలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్టు సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య తెలిపారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద శుక్రవారం ఏఐవైఎఫ్ మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రొడ్డ గోపి, ఏఐఎస్ఎఫ్ నాయకులు, కోగిలి మునిచందు, ప్రజానాట్య మండలి నాయకురాలు చారులత, మురళి, జనార్ధన్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ



ప్రయాణికుడికి సూట్ కేస్ అందజేస్తున్న డ్రైవర్

రేణిగుంట(శ్రీకాళహస్తి రూరల్): ప్రయాణికుడు ఆటోలో మరిచిపోయిన సూట్ కేస్‌ను డ్రైవర్ పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన నిఖిల్‌కుమార్ శుక్రవారం రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ఎర్రమరెడ్డిపాలెంకు డ్రైవర్ విజయ్‌కుమార్ ఆటోలో తిరుచానూరుకు వెళ్లాడు. సూట్ కేస్‌ను ఆటోలోనే మరిచిపోయాడు. గమనించిన డ్రైవర్ దాన్ని రేణిగుంట పోలీసులకు అప్పగించాడు. వారు దాన్ని తెరిచి నిఖిల్ కుమార్‌కు ఫోన్ చేసి పిలిపించి సూట్ కేస్‌ను అందజేశారు. ఆటో డ్రైవర్‌ను అభినందించారు.


విద్యార్థులందరూ పాసయ్యేలా చూడండి

బుచ్చినాయుడుకండ్రిగ: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్న మండలంలోని ఐదు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులందరూ పాసయ్యేలా చూడాలని ఎంఈఓ-2 మునిసుబ్రమణ్యం ఆదేశించారు. ఆయన శుక్రవా రం నెలవాయి జెడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. పదో తరగతిలో 21 మంది ఫెయిలైతే, గణితంలోనే 8 మంది ఫెయిలైన వారు ఉన్నట్టు చెప్పారు. వీరిపై టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తీర్ణులయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం.రవీంద్రరెడ్డి, టీచర్ పద్మావతి పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కర్నూలు కలెక్టర్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం కర్నూలు కలెక్టర్ రంజిత్‌బాషా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఐవోబీ మేనేజర్‌కు సన్మానం



రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన అరుల్ దాసన్‌ను శుక్రవారం ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు, సర్పంచ్ నగేషం, మండల కో ఆప్షన్ మెంబర్ హసన్ సాహెబ్, తులసి రాజన్, సీహెచ్ విజయ్య సన్మానించారు. జూలియన్ రాజు మాట్లాడుతూ రేణిగుంట ఐవోబీ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.

అర్ధాంతరంగా ఆగిన పనులు

మండలంలో కంచనపుత్తూరులోని గ్రామ సచివాలయాల వద్ద శానిటరీ కాంప్లెక్స్ పనులు అర్ధాంతరంగా ఆగాయి. దీంతో సచివాలయ సిబ్బంది, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు మల, మూత్ర విసర్జనకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.3 లక్షలు మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనుల గురించి పట్టించుకోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనులు చేపట్టి శానిటరీ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. – బుచ్చినాయుడుకండ్రిగ



బైటకొడియంబేడు సచివాలయం మూత



నాగలాపురం మండలంలోని బైటకొడియం బేడు సచివాలయం శుక్రవారం తాళం వేసి మూసి వేశారు. దీంతో వివిధ పనుల నిమిత్తం వస్తున్న రైతులు, ప్రజలు నిరాశతో వెనుదిరిగారు ఈ సచివాలయంలో కొందరు సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇక్కడ 11 మంది ఉద్యోగులున్నా సచివాలయాన్ని తెరవడానికి ఒక్కరు కూడా రాలేదని విమర్శించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ సేవలు సక్రమంగా అందేలా చూడాలని, ఉద్యోగులు సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – నాగలాపురం

గదుల నిర్మాణమెప్పుడో..?

రేణిగుంటలోని పోస్టాఫీసు ఎదురుగా గతంలో పంచాయతీ గదులు ఉండేవి. వాటి ద్వారా ఏడాదికి రూ.లక్షల ఆదాయం వచ్చేది. గదులు మరమ్మతులకు గురవడంతో వాటిని కూల్చివేశారు. గదులు నిర్మించి దుకాణాలకు టెండర్లు పిలవాలని భావించినా కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం ఆ స్థలం విలువ రూ.కోట్లలో ఉంది. అలాగే వదిలేస్తే ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉందని, గదులు నిర్మించి అద్దెకు ఇవ్వడం ద్వారా పంచాయతీకి ఆదాయం వస్తుందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పంచాయతీ ఈవో వివరణ కోరగా భవనం నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే గదులు నిర్మించి టెండర్లు పిలుస్తామన్నారు. – రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్)



శ్రీసిటీ-ఐఎఫ్ఎఫ్ పరిశ్రమ వితరణతో కమ్యూనిటీ లైబ్రరీ





వడ్డిపాళెంలో కమ్యూనిటీ లైబ్రరీని ప్రారంభిస్తున్న శ్రీసిటీ ఐఎఫ్ఎఫ్ ప్రతినిధులు, హాజరైన వడ్డిపాళెం గ్రామస్తులు, విద్యార్థులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీలోని ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్నాన్సెస్ (ఐఎఫ్ఎఫ్) పరిశ్రమ యాజమాన్యం తమ సీఎస్ఆర్ చర్యల్లో భాగంగా రూరల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ (రీడ్) సంస్థ భాగస్వామ్యంతో వరదయ్యపాళెం మండలం వడ్డిపాళెంలో కమ్యూనిటీ లైబ్రరీ-రిసోర్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఐఎఫ్ఎఫ్ ఆపరేషన్స్ హెడ్ శరవణన్ అరుణాచలం, శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి దీనిని లాంఛనంగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ, విద్య, కమ్యూనిటీ అభివృద్ధిని ప్రోత్సహించడానికే కమ్యూనిటీ లైబ్రరీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పిల్లలకు చదవడం, రాయడం వంటి నైపుణ్యాలతో పాటు, యువతీ యువకులకు చేతివృత్తులలో శిక్షణ, ఆరోగ్య అవగాహన కల్పించడం కమ్యూనిటీ లైబ్రరీ-రిసోర్స్ సెంటర్ ముఖ్యోద్దేశమన్నారు. ఇందులో లైబ్రరీ, కంప్యూటర్ రూమ్, శిక్షణా హాలు, పిల్లలు, మహిళలకు ప్రత్యేక విభాగాలు ఉంటాయన్నారు. గ్రంథాలయంలో వివిధ పుస్తకాలతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, పోటీ పరీక్షలు, ఉన్నత విద్యకు అవసరమైన ఈ-కంటెంట్ కూడా అందుబాటులో ఉందని రీడ్ ఇండియా బృంద సభ్యులు వివరించారు. వడ్డిపాళెం, పరిసర గ్రామస్తులు, ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, దీని నుంచి మంచి ఫలితాలను పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐఎఫ్ఎఫ్ ఫ్యాక్టరీ మేనేజర్ శరవణన్ బాలసుబ్రమణ్యం, ఐఎఫ్ఎఫ్ హెడ్ రాజశేఖర్ మణి, హెచ్‌ఆర్ హెడ్ అరుణ్ కుమార్, అడ్మిన్ హెడ్ వెంకట భాస్కర్, సీఎస్ఆర్ హెడ్ కార్తీక్ పళని, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్, వడ్డిపాళెం, పరిసర గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఊంజల్ సేవ

నారాయణవనం: పద్మావతీ అమ్మవారికి శుక్రవారం సాయంత్రం ఊంజల్ సేవను ఘనంగా చేపట్టారు. పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి ఉదయం శుక్రవార అభిషేకాలను చేశారు. సాయంత్రం అమ్మవారిని తిరుచ్చిపై అధిష్టింపజేశారు. అంతరం ప్రాకారంలో ఊరేగించారు. తదుపరి ఊంజల్ మండపంలో ఊంజల్ సేవ చేపట్టారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం ,అధికారి భరత్, అర్చకులు నరసింహభట్టాచార్యులు పర్యవేక్షించారు.

పచ్చాలమ్మకు ప్రత్యేక పూజలు



బుచ్చినాయుడుకండ్రిగ: పల్లమాలలోని పచ్చాలమ్మ కాలనీలోవున్న పచ్చాలమ్మకు శుక్రవారం అభిషేకాలు చేసి, పూలతో అలంకరించారు. గ్రామస్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు.

నేడు శనిత్రయోదశి పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలోని శ్రీ సర్వ మంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం శనిత్రయోదశి ప్రదోష పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి లత తెలిపారు.ఈ పూజలో పాల్గొనదలచిన వారు రూ.500 చెల్లించి రసీదు పొందాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

సత్యవేడు/నాగలాపురం: దాసుకుప్పం, సత్యవేడు, సుబ్బనాయుడుకండ్రిగ, బీరకుప్పం సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ, ఏడీ రమేష్‌చంద్ర, ఏఈ పృథ్వి తెలిపారు.

రాయితీపై పశువుల దాణా

సత్యవేడు: తెల్ల రేషన్ కార్డు ఉన్న రైతులకు 50శాతం సబ్సిడీపై పశువుల దాణా ఇస్తున్నట్లు పశువైద్యాధికారి దయాకర్ తెలిపారు. 50 కేజీల దాణా రూ.1110లని, సబ్సిడీపై దీనిని రూ.555కే ఇస్తున్నామని, కావాలసిన రైతులు తమ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

ఆలయ కమిటీల ఏర్పాటుకు నోటిఫికేషన్

నారాయణవనం: సత్యవేడు నియోజకవర్గంలోని నారాయణవనం, పిచ్చాటూరు మండలాలలో ఆలయాల నిర్వాహక కమిటీల ఏర్పాటుకు దేవదాయ, ధర్మాదాయ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. మండలంలోని కై లాసనాథస్వామి, పిచ్చాటూరు మండలంలోని వాలీశ్వరస్వామి, సుబ్రమణ్యం స్వామి ఆలయాలకు నూతన కమిటీలలో సభ్యుల నియామకానికి 20 రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా దేవదాయ శాఖ అధికారి నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

డిజిటల్ విజన్ డ్రమ్ వితరణ

శ్రీకాళహస్తి: పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భక్తకన్నప్ప ఉచిత కంటి ఆస్పత్రికి శుక్రవారం పట్టణానికి చెందిన జశ్వంత్ డిజిటల్ విజన్ డ్రమ్ వితరణ చేశారు. అదే విధంగా ఊరందూరు సమీపంలోని విష్ణు బేరియం పరిశ్రమ ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుందరరామిరెడ్డి, పేట జనార్ధన్, కుమారస్వామి, ఆస్పత్రి కోఆర్డినేటర్ దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిరియాల బాబా గంధోత్సవం



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మత పెద్దలు



ఆశ్రమంలో భజనలు చేస్తున్న ముస్లింలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంటలోని మిరియాల బాబా ఆశ్రమంలో శుక్రవారం గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గంధాన్ని హిందువు ఇంటి నుంచి తీసుకువచ్చి ఆశ్రమంలో సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా రేణిగుంటకు చెందిన దాముదెడ్డి ఇంటి నుంచి గంధం ఊరేగింపుగా తీసుకువచ్చి పీఠాధిపతి ఖ్వాజా జుబేర్ హయత్ ఖాదరీకి సమర్పించారు. ఫకీర్ల విన్యాసాలు, బ్యాండు వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర మషాయిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ షరీఫ్, ఉపాధ్యక్షుడు ఎస్.మస్తాన్, జిల్లా కార్యదర్శి జమీషా ఖాదరి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పీఠాధిపతి మాట్లాడుతూ గంధోత్సవం మూడు రోజులు జరుగుతుందన్నారు. శనివారం ఆశ్రమ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గౌసియా ఆశ్రమం చారిటబుల్ ట్రస్ట్ కమిటీ సభ్యులు సత్తార్ ఖాదరి, షేక్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.


రావణేశ్వరసేవలో అగస్త్యేశ్వరుడు



మాడవీధి ఉత్సవంలో నటరాజస్వామి

నారాయణవనం: మండలంలోని సముదాయంలో మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రాత్రి పరమభక్తుడైన రావణాసురుడిని వాహనంగా చేసుకుని అగస్త్యేశ్వర స్వామి విహరించారు. ఉదయం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివగామీ సమేతుడైన నటరాజస్వామి తిరుచ్చిపై కొలువుదీరి ఆలయ మాడ వీధుల్లో విహరించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. ఏఈఓ రవి, అధికారకులు నాగరాజు, భరత్, అర్చకులు రమేష్ గురుకుల్, గౌతం గురుకుల్ పర్యవేక్షించారు. శనివారం ఉదయం కైలాసనాథకోన తీర్థంలో త్రిశూల స్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ అధికారి తెలిపారు.


సివిల్స్ ర్యాంకర్‌కు అభినందన



సురేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: ఐఏఎస్ అధికారిగా పేద ప్రజల సంక్షేమానికి, అభ్యున్నతికి కృషి చేయాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. మండలం నుంచి ఐఏఎస్‌కు ఎంపికైన సురేష్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కలిసి అభినందించారు. మండలంలోని గోవిందప్పనాయుడుకండ్రిగకు చెందిన సురేష్ జెన్‌కోలో ఇంజినీర్‌గా పనిచేస్తూ సివిల్స్‌లో ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి పడివేటమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, సురేష్ దంపతులను, తల్లిదండ్రులు మురగయ్య, మునెమ్మలను శాలువ కప్పి, పుష్ప గుచ్ఛాలతో అభినందించారు.

సంతలో ఇబ్బంది కలిగించొద్దు



మాట్లాడుతున్న ఎస్ఐ విశ్వనాథనాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని వారపు సంతకు సరుకుల కోసం వచ్చే కొనుగోలుదారులకు ఇబ్బందులు కలిగించరాదని ఎస్ఐ విశ్వనాథనాయుడు హితవు పలికారు. శుక్రవారం ఆయన వారపు సంతను పరిశీలించి, వాహనదారులతో మాట్లాడారు. సంతకు ద్విచక్రవాహనాలపై వచ్చేవారు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతున్నాయని, అలాగే షాపుల వారు రోడ్డుపై సరుకులను అమ్మరాదన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బాలగురవయ్య, కానిస్టేబుల్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నారాయణవనం: నారాయణవనానికి చెందిన మోహన, లత, మునస్వామి, డీకే పాళ్యంకు చెందిన గోపి అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం ఖర్చుల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. వారికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.4 లక్షలు మంజూరైంది. ఈ క్రమంలో చెక్కులను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే హేమలత, గంగాప్రసాద్ అందజేశారు.

హాస్టళ్లలో మలాథిన్ పిచికారీ

సత్యవేడు: ప్రభుత్వ హాస్టళ్లలో దోమల నివారణ చర్యల్లో భాగంగా సత్యవేడులోని పలు హాస్టళ్లలో మలాథిన్ పిచికారీ చేసినట్లు దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ అరుణ్ కిషోర్ తెలిపారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, బీసీ బాలుర గురుకుల పాఠశాల హాస్టళ్ల గదులు, విద్యార్థుల అల్మారాలు శుభ్రం చేసి మాలాథిన్ స్ప్రే చేశారు. సత్యవేడు-1 సచివాలయం, బీసీ బాలుర హాస్టల్, బీసీ బాలికల హాస్టళ్లలోనే దోమల నివారణ చర్యలు తీసుకున్నారు. ఎంపీ హెచ్‌ఈఓ సుబ్రమణ్యం పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీహెచ్ ఈఓ షణ్ముగం(మేల్), ఏఎన్ఎంలు రోసిలిన్, లతా దేవి, సచివాలయ ఏఎన్ఎంలు భువనేశ్వరి, శకుంతల, సుజాత, శాంతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అధికారుల డుమ్మా!

- మొక్కుబడిగా మండల సమావేశం
- గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని సభ్యుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రేఖ

నాగలాపురం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ రేఖ అధ్యక్షత వహించారు. ప్రధాన శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో సమావేశం ఈ పరిస్థితి తలెత్తింది. మూడు నెలలకోసారి నిర్వహించే మండల సమావేశానికి ముఖ్యమైన శాఖల అధికారుల గైర్హాజరుపై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహ్మద్ రఫీ, జెడ్పీటీసీ విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

కావమ్మ జాతర ప్రారంభం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట పంచాయతీ వడ్డిమిట్టలో కొలువైన కావమ్మ జాతర మహోత్సవం శుక్రవారం వినాయక ట్రేడర్స్ యజమాని కిషోర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారికి విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం కావమ్మ, మారయ్య జీవిత చరిత్రను వినిపించారు. రాత్రి అమ్మవారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆదివారం అగ్ని గుండం ప్రవేశం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పి.వాసు, పి.ఈశ్వరయ్య, పి.బాలాజీ, పి.మురళీ, పి.మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గోప్యంగా టెండర్ల ప్రక్రియ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మేజర్ పంచాయతీలో టెండర్ల ప్రక్రియను గోప్యంగా ఉంచడంపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఈవో మణి, సర్పంచ్ నగేషం ఆధ్వర్యంలో షీల్డ్ టెండర్లు నిర్వహించారు. ఇందులో ఎంతమంది టెండర్లు వేశారు అన్న విషయం గురించి గోప్యంగా ఉంచారు. కూటమి నేతలు తమ వారికి టెండర్లు దక్కేలా చేయడానికే గోప్యంగా ఉంచారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. టెండర్లు దక్కించుకున్న వారి వివరాలను మాత్రమే వెల్లడించారు. పబ్లిక్ హెల్త్ మెటీరియల్ సప్లయి టెండర్‌ను సాయి కళా ఎంటర్‌ప్రైజెస్, వాటర్ సప్లయి మెటీరియల్ టెండర్‌ను సుప్రమాన్ ట్రేడర్స్, వాటర్ మోటార్ వైరింగ్ టెండర్‌ను సాయిదుర్గ దక్కించుకున్నట్టు అధికారులు వెల్లడించారు. దీనిపై ఈవో వివరణ ఇస్తూ టెండర్ల వివరాలను వెల్లడించే అధికారం తమకు లేదన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



రాజేష్‌కు నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

నారాయణవనం: నాయకులకు, కార్యకర్తలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. మండలంలోని డీకే పాళ్యం వైఎస్సార్ సీపీ నాయకుడు తోటి రాజేష్ శుక్రవారం మృతి చెందారు. ఇది తెలుసుకున్న రాజేష్ పార్టీ నాయకులతో కలిసి తోటి రాజేష్ మృతదేహానికి పూలమాలకు వేసి నివాళ్లు అర్పించారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో పార్టీ మండల కన్వీనర్ సారకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, జిల్లా క్రియాశీల కార్యదర్శి రాకేష్‌కిరణ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలువురు నాయకులు ఉన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన సదస్సు



ఏర్పేడు మండలం ఆమందూరులో బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో కృష్ణమంజరి

ఏర్పేడు(రేణిగుంట): కిశోర బాలికలు శారీరక, మానసిక మార్పులకు అనుగుణంగా వచ్చే ఉద్వేగాలను నియంత్రణలో ఉంచుకోవాలని రేణిగుంట సీడీపీవో కృష్ణమంజరి, సూపర్‌వైజర్ మంజుల తెలిపారు. ఏర్పేడు మండలం ఆమందూరు, కాట్రకాయలగుంట, శ్రీకాళహస్తి మండలం ఎల్లంపల్లి గిరిజన కాలనీ, జగ్గరాజుపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం కిశోరి వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కిశోర బాలికలు ఆత్మరక్షణ, నైపుణ్య ఉపాధి, లింగ వివక్ష తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నాణ్యమైన విద్య, సంపూర్ణ ఆహారంతో ఆరోగ్యం, రుతుస్రావ పరిశుభ్రత, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా తదితరాలపై అవగాహన కలిగించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఏర్పేడు మండలంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రత్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, లక్ష్మి, ధనమ్మ, శిరీష, శ్రీకాళహస్తిలో ప్రగతి స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పోలమ్మ, బుజ్జమ్మ పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం కృష్ణాపురంలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమావతి ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై అవగాహన సదస్సు, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని బాలికలు ఆత్మరక్షణ, నైపుణ్య ఉపాధిపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

శేషవాహనంపై చెన్నకేశవుడు



రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో జరుగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి చెన్నకేశ్వర స్వామి శేష వాహనంపై ఊరేగారు. మహిళలు కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీకాళహస్తి ఆలయ అధికారులు, గ్రామ పెద్దలు, పూజారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే జైలుకే..!

బుచ్చినాయుడుకండ్రిగ: బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యమున హెచ్చరించారు. శుక్రవారం నీర్పాకోటలో ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కిశోర బాలికలు సంపూర్ణ ఆరోగ్యం, రుతు పరిశుభ్రత, పోషకాహారం, పోక్సో చట్టం, ఆత్మరక్షణ, యోగా, జీవనోపాధి అవకాశాలు, సైబర్, ఆన్‌లైన్ మోసాలు, ఆర్థిక నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.